ఆరు గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేస్తాం

- సామాజిక న్యాయం ఏడో గ్యారెంటీ
- ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగాల భర్తీ
- కందుకూరు వరకు మెట్రోరైలు విస్తరణ
- మూసీ కారిడార్ సంపూర్ణంగా అభివృద్ధి
- నిజాం షుగర్ ఫ్యాక్టరీపై కమిటీ వేస్తాం
- ఆరోగ్యశ్రీలో 10 లక్షల వరకు చికిత్స: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఏ కష్టమొచ్చినా, నష్టమొచ్చినా, ఎవరు అడ్డుపడ్డా, ఎవరు అభ్యంతరపెట్టినా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంత్రివర్గ సహచరులందరి తరుపున తెలంగాణ ప్రజలకు మాట ఇస్తున్నానని చెప్పారు. తెలంగాణ ప్రజలకు సోనియాగాంధీ ఇచ్చిన మాటను గతంలోనూ నిలుపుకొన్నారని, ఇప్పుడు కూడా నెరవేర్చుతారని అన్నారు. ప్రతిపక్షంతోపాటు అందరి సలహాలు తీసుకొని ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత తీసుకొస్తామని చెప్పారు. శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు అడుగుతం.. కడుగుతం అన్న శ్రీశ్రీ మాటను గుర్తు చేశారు. మా కుటుంబ, మా పార్టీ, మా ఇష్టం అనే నిరంకుశత్వం ఎన్నటికీ చెల్లదని తేల్చి చెప్పారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛనిచ్చిన ప్రభుత్వం తమదని అన్నారు. నాడు అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసినట్టుగా నియంతృత్వం చేయబోమని, మాట్లాడేందుకు ప్రతిపక్షానికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు.

అమరుల కుటుంబాలను పట్టించుకోలేదు

తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన యాది రెడ్డి, శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, ఇషాన్‌రెడ్డి, యాదయ్య.. ఇలా ఏ ఒక్కరి కుటుంబాన్ని అయినా నాటి సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌కు ఆహ్వానించి వారికి పెద్ద దిక్కుగా ఉంటానని భరోసా ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పాలకులు అమరుల కుటుంబాలను పట్టించుకోలేదని విమర్శించారు. అమరుల కుటుంబాలకు చట్టసభల్లో అవకాశం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం కోసం డీఎస్పీ పదవికి రాజీనామా చేసిన నళినికి రాష్ట్రం వచ్చాక ఎందుకు ఉద్యోగం తిరిగి ఇవ్వలేదని నిలదీశారు. ఇక తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులను తొలగించాలన్న ఆలోచన ఎప్పుడైనా చేశారా? అని ప్రశ్నించారు. ధర్నాచౌక్‌ను ఎత్తేసి నిర్బంధ పాలనకు తెరతీశారని విమర్శించారు. తాము మాత్రం మళ్లీ ధర్నాచౌక్‌ను ప్రారంభించి ధర్నాలు చేసుకునే స్వేచ్ఛ కల్పించామని అన్నారు.

రైతుల గురించి అన్నీ అబద్ధాలే

రాష్ట్రంలో రైతుల ఆదాయం పెరిగిందని, ఆత్మహత్యలు తగ్గాయని, వలసలు తగ్గాయని, పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా కోటి ఎకరాలకు నీళ్లు ఇచ్చామని గత ప్రభుత్వం పదే పదే చెప్పినవన్నీ అబద్ధాలేనని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. 'రైతు ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం 25వ స్థానంలో ఉన్నది. ఇక్కడ రైతు ఆదాయం రూ.9,403గా ఉన్నది. ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ రాష్ట్రం ఎప్పుడూ మొదటి లేదా రెండో స్థానంలోనే ఉన్నది. సుమారు 8 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు ఎన్సీఆర్బీ చెప్తున్నది. రైతుబీమా పథకం ప్రకారం రూ.1,21,965 మంది మరణించినట్టు తెలిపారు. ఇవి ప్రభుత్వం చేసిన హత్యలు కావా? పంటలకు బీమా ఉండాలే తప్పు.. రైతు చనిపోయిన తర్వాత ఏం ఇచ్చినా ఏం లాభం? తెలంగాణలో పసుపు, చెరుకు, కంది, మొక్కజొన్న, మిరప, సోయాబీన్ వంటి వాణిజ్య పంటలన్నీ తగ్గిపోయాయి. కేవలం వరి పండించే పరిస్థితి వచ్చింది. రూ.1,400లకే ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు తాలు పేరుతో కోత పెడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు? కేంద్ర నివేదిక ప్రకారం విద్యుత్తు తలసరి వినియోగంలో తెలంగాణ 10వ స్థానంలో ఉన్నది. కానీ గత ప్రభుత్వం మాత్రం ఒకటో స్థానంలో ఉన్నదని అబద్ధం చెప్పింది. కాలువల ద్వారా సాగునీళ్లు అందిస్తే పంపుసెట్లు ఎందుకు పెరుగుతాయి? కాళేశ్వరం ద్వారా కోటి ఎకరాలకు నీళ్లు ఇచ్చామన్నది శుద్ధ అబద్ధం' అని సీఎం విమర్శించారు.

నాటి సీఎంలెవరూ న్యాయం చేయలేదు

ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు ముఖ్యమంత్రులుగా ఉన్నవారెవరూ తెలంగాణకు న్యాయం చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక ఈ ప్రాంతానికి న్యాయం జరగదని గుర్తించి తెలంగాణ ప్రజలు కోదండరాం నాయకత్వంలో జేఏసీగా ఏర్పడి అన్ని పార్టీలు ఏకమై ఉద్యమాలు చేయడం ద్వారా సోనియా గాంధీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సోనియాగాంధీ దయవల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని నాటి సీఎం కేసీఆర్ శాసన సభలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పదే పదే గతాన్ని తొవ్వడం మానుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు. 2014 జూన్ 2 నుంచి తొమ్మిదన్నరేండ్లు మీరు (బీఆర్‌ఎస్) పరిపాలించారని, రాబోయే పదేండ్లు తాము పరిపాలన అందించబోతున్నామని తెలిపారు.

కొత్త సభ్యులు మనల్ని చూసి నేర్చుకోవాలి

సభలోకి వచ్చే సభ్యులు ప్రిపేర్ అయ్యి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సభలో 50 మంది కొత్తగా వచ్చినవారున్నారని, వాళ్లందరు మనల్ని చూసి నేర్చుకోవాలని అన్నారు. 'మనం పాలకులం కాదు.. సేవకులం. అధికారం చెలాయించడానికి, నిరంకుశత్వం చేయడానికి ఇక్కడికి రాలేదు. 4 కోట్ల మంది ప్రజలకు సేవ చేయడానికే ఇక్కడికి వచ్చాం. మీకు న్యాయం జరగకుంటే నిరసనలు, ధర్నాలు చేయొచ్చు. ధర్నాచౌక్‌ను కూడా ఓపెన్ చేశాం. సహేతుకమైన సలహాలు, సూచనలు స్వీకరించేందుకు మేము ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం' అని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు జరగడం లేదని, జీవో ఇవ్వలేదని అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుపై నేను సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజునే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ ఈ నెల 8వ తేదీనే జీవో నం.191 ద్వారా ఉత్తర్వులు కూడా జారీ చేశాం. రాజీవ్ ఆరోగ్యశ్రీలో భాగమైన ఏ దవాఖాన అయినా బాధితులను చేర్చుకోకపోయినా, రూ.10 లక్షల వరకు చికిత్స ఇవ్వకపోయినా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. ఆ దవాఖానలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

సంవత్సరంలోగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ

సంవత్సరంలోగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, మెట్రోరైలును వివిధ ప్రాంతాలను కలుపుతూ కందుకూరు వరకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చకు సమాధానంగా సీఎం మాట్లాడుతూ, సహేతుకమైన సూచనలు చేస్తే స్వీకరించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని సీఎం స్పష్టంచేశారు. రూ.లక్షన్నర కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బరాజ్ కుంగిందని, అన్నారం పగిలిపోయిందని విమర్శించారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని తెలిపారు. సమావేశాలు ముగిసిన తరువాత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మేడిగడ్డ సందర్శనకు తీసుకెళ్తానని తెలిపారు. మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన 317జీవో, సీపీఎస్ రివైజ్ చేయడం వంటి అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో త్వరలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేస్తామన్నారు.

వారంలో మూడురోజులు అందుబాటులో మంత్రులు

తాము అధికారం చేపట్టి పదిరోజులు కూడా కాలేదని, రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని సీఎం చెప్పారు. తాము ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, మంత్రులు కూడా వారంలో మూడు రోజులు సచివాలయంలో అందుబాటులో ఉంటారని, ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలపై సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు వారిని కలవొచ్చని సూచించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలి సమావేశాలు పాత భవనంలో నిర్వహిస్తామని చెప్పారు.

జయ జయహే గేయాన్ని రాష్ట్రీయ గేయంగా చేయలేదేం?

అందెశ్రీ రచించిన జయహే.. జయ జయహే గేయాన్ని రాష్ట్రీయ గేయంగా చేస్తామని ప్రకటించిన గత పాలకులు అలా ఎందుకు చేయలేదని సీఎం నిలదీశారు. తన ప్రసంగంలో ఉటంకించిన అందెశ్రీ గేయంలోని పదాలపై బీఆర్‌ఎస్ సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అభ్యంతరం తెలపడంపై స్పందిస్తూ, తాను రచయితను కాదని, అందెశ్రీ రాసిన గేయాన్ని తాను యథావిధిగా చదివినట్టు చెప్పారు. ఇకముందు ఏదైనా గేయాన్ని ఆలపించాల్సి వస్తే తప్పనిసరిగా దేశపతితో సలహాలు తీసుకుంటానని అన్నారు.

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం

సోనియమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో కచ్చితంగా ఇందిరమ్మ రాజ్యం తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం. దళితులు, గిరిజనులకు అసైన్డ్ భూములిస్తాం. పోడు పట్టాలిస్తాం. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తాం. పేదలకు ఆరోగ్యశ్రీ ఇస్తాం. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు ఇస్తాం.. ఇలా ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. మా ప్రభుత్వం తెలంగాణకు స్వేచ్ఛ ఇస్తుంది, సమానత్వం కల్పిస్తుంది. ఇందిరమ్మ ఇంట్లో ఉంటూ ఎడ్మ బొజ్జు ఈ రోజు ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిచారు. బలహీన వర్గానికి చెందిన బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకరయ్య, మందల సామేలు.. ఇలా అంత్యంత పేదలకు కాంగ్రెస్ న్యాయం చేసింది' అని చెప్పారు.

అసెంబ్లీ ముచ్చట్లు

డ్రగ్స్‌పై ఉపేక్షించేది లేదు

గత ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ కేసుల విచారణలో ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం మాత్రం డ్రగ్స్ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఈ విషయంపై అందరూ ఒకే త్రాటిపై ఉంటే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రతిపక్షాలను కోరారు. ఇది మన పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని తెలిపారు. ఆరు గ్యారెంటీలతోపాటు ప్రజలకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అనే ఏడో గ్యారెంటీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని సీఎం తెలిపారు.

పౌరసరఫరాల శాఖ పూర్తిస్థాయిలో ప్రక్షాళన

- మండలిలో ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): పౌరసరఫరాల శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో పౌరసరఫరాల శాఖపై ఉత్తమ్ స్పందించారు. రాష్ట్రంలో 92 లక్షల టన్నుల ధాన్యం కొనుగో లు చేశారని, వాటికి సంబంధించి 62 లక్షల టన్నుల బియ్యం కస్టమ్ చేయాలని రైస్ మిల్లర్స్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. సంబంధిత బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వలేదని, మిల్లు ల్లో కూడా నిల్వలు లేవని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖ రూ.56వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని అన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ అప్పులు ప్రస్తుతం రూ.11 వేల కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి కేంద్రం 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం కిలో చొప్పున ఇస్తున్నదని తెలిపారు.

ఉమ్మడి జిల్లాకో జోన్ చేయాలి

- 317 జీవోను పునఃసమీక్షించాలి
- మండలిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగా): ఉమ్మడి పది జిల్లాల ప్రాతిపదికన.. ఒక్కో ఉమ్మడి జిల్లాను ఒక జోన్‌గా రూపొందించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో నూతన జోనల్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం పున:సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చను జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 317 జీవో వల్ల ఉద్యోగులు, విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వాటిని సరిదిద్దడానికి దానిని పునఃసమీక్షించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును సత్వరం పూర్తిచేయాలని, కేంద్రం వివక్ష వల్ల ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించలేకపోయామని చెప్పారు. కృష్ణానదిపై ఏపీ అక్రమ ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. కృష్ణా జలాలను కాపాడుకోవడంలో ఉదాసీనత తగదన్నారు.

రీయింబర్స్‌మెంట్‌ను నెలవారీగా చెల్లించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షల పెంపు పథకాలకు సంబంధించిన రీయింబర్స్‌మెంట్‌ను నెలవారీగా చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలిలో గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు, పేదలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు.

కేసీఆర్ గొప్ప దార్శనికుడు: మధుసూదనాచారి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప దార్శనికుడని, నేటి పాలకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి హితవు పలికారు. శనివారం మండలిలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. తాయిలాలు ప్రకటించి ఓట్లు వేయించుకోవడం కాంగ్రెస్ పాలకుల విధానమని, దీనికి భిన్నంగా కేసీఆర్ అనాదిగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేశారని కొనియాడారు. తరతరాలుగా వస్తున్న సమస్యలను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పరిష్కరించలేకపోయాయని విమర్శించారు. కేసీఆర్ తన పాలనలో ఎటువంటి పక్షపాతం చూపలేదని, అప్పటి విపక్ష సభ్యుడు, నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గంలోని ఒక మండలంలో దళితబంధును అమలుచేయడమే ఇందుకు నిదర్శనమన్నారు.

నిర్బంధాలపై కాంగ్రెస్ మాట్లాడటం హాస్యాస్పదం: దేశపతి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): నిర్బంధాల గురించి కాంగ్రెస్ మాట్లాడటం అంటే పులి శాకాహారం గురించి మాట్లాడినట్టే ఉంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. మండలిలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు నిర్బంధ పాలనను రుచి చూపించింది కాంగ్రెస్ పార్టీయేనని, ఎమర్జెన్సీ విధించిన చరిత్ర కూడా ఆ పార్టీదేనని విమర్శించారు. ఉద్యమ సందర్భంగా నాటి కాంగ్రెస్ పాలకులు తీవ్ర అణచివేతకు పాల్పడ్డారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులపై మలబార్ పోలీసులతో కాల్పులు జరిపించి నెత్తురుటేర్లు పారించారని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో అసెంబ్లీ, ప్రగతిభవన్ ముందు ముండ్ల కంచెలను నిర్మించింది కూడా ఆ పాలకులేనని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గెలవగానే బీఆర్‌ఎస్ సభ్యులపై దాడులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులు చేస్తున్నారని విమర్శించారు.

కౌంటర్.. ఎన్‌కౌంటర్

- అసెంబ్లీలో రేవంత్ X కేటీఆర్
- విమర్శలు, ప్రతివిమర్శలతో ఆసక్తికరమైన చర్చ
- సీఎం వ్యాఖ్యలకు దీటుగా జవాబిచ్చిన కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ మధ్య వాదోపవాదాలు ఆసక్తికరంగా జరిగాయి. ఇద్దరు నేతలూ విమర్శలు, ప్రతి విమర్శలతో రెచ్చిపోయారు. సీఎం చేసిన పలు వ్యాఖ్యలను కేటీఆర్ ఘాటుగా తిప్పికొట్టారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సీఎం తిప్పికొడుతూ ఆయనను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించారు. కొన్ని అంశాల మీద ఇద్దరు నేతల మధ్య జరిగిన చర్చ ఇలా కొనసాగింది.

గత ప్రభుత్వంలో ఇసుకను దోపిడీ చేశారు. ప్రశ్నించిన దళితులపై దాడులు చేశారు. నేరెళ్ల ప్రజలను కేసులు పెట్టి హింసించారు. దళితులను లాకప్‌లలో పెట్టి.. కరెంట్ షాక్ ఇచ్చి హింసించారు : సీఎం రేవంత్‌రెడ్డి

గతంలో ఇసుక ఆదాయం కాంగ్రెస్ నేతల జేబుల్లోకి పోయిందా..: కేటీఆర్

నేరెళ్లలో ఏదో జరిగినట్టు శాండ్ మాఫియా అంటున్నారు. ఇసుక మీద 2004 నుంచి 2014 వరకు వచ్చిన ఆదాయం రూ.39.5 కోట్లు. అంటే ఏటా కనీసం రూ.4 కోట్లు కూడా రాలేదు. 2014 నుంచి 2023 వరకు ఇసుకపై ఆదాయం రూ.5 వేల కోట్లకుపైగా వచ్చింది. శాండ్ మాఫియా ఎవరిది? ఆనాడు ఇసుక ఆదాయం ఎక్కడికి పోయింది? కాంగ్రెస్ నేతల జేబుల్లోకి పోయిందా? నేరెళ్లలో ఏదో జరిగిందని పాత చింతకాయ పచ్చడి మాటలే చెప్తున్నరు. అదే నేరెళ్ల ఉన్న నియోజకవర్గం నుంచి ప్రజలు మరోసారి న న్ను గెలిపించారు. అధికారం మీ చేతుల్లోనే ఉంది.. ఏ విచారణ చేసుకుంటారో చేసుకోవాలి.

పంటల బీమాకు, రైతుబీమాకు తేడా తెలియని వ్యక్తి సీఎం...: కేటీఆర్

పంటల బీమాకు, రైతుబీమాకు తేడా తెలియని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నందుకు తాను నిజంగానే సిగ్గుపడుతున్నట్టు కేటీఆర్ తెలిపారు. రేవంత్‌రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా కాకుండా, టీపీసీసీ అధ్యక్షుడిలా గాంధీభవన్‌లో కూర్చొని మాట్లాడుతున్నట్టు చాలా దారుణంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి ఇది తగదని, పంట బీమాకు, రైతుబీమాకు తేడా తెలియని వ్యక్తి ఆ పదవిలో కూర్చోవడంతో రాష్ట్ర ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

మేనేజ్‌మెంట్ కోటాలో పదవి పొందాలనుకుంటే కేటీఆర్‌కు నిరాశ ఎదురైంది. పదవి దక్కలేదనే నిరాశతోనే కేటీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన వాళ్లతో ఇదే ఇబ్బంది: సీఎం రేవంత్

ఢిల్లీని మేనేజ్ చేసి పీసీసీ, సీఎం పదవి తెచ్చుకున్నదెవరో..?: కేటీఆర్

మాట్లాడితే మేనేజ్‌మెంట్ కోటా అంటున్నరు. ఢిల్లీని మేనేజ్ చేసి సీఎం పదవి తెచ్చుకున్న వ్యక్తి, ఢిల్లీని మేనేజ్ చేసి పీసీసీ పదవి తెచ్చుకున్న వ్యక్తి ఎవరో.. అలాంటి వ్యక్తి ఈరోజు మేనేజ్‌మెంట్ కోటా గురించి మాట్లాడితే ఎట్లా? మేము కూడా అదే చెప్తున్నాం తెలంగాణ ప్రజలు కోరుకున్న సీఎం కాదు.. ఢిల్లీ నామినేట్ చేసిన సీఎం అనే అంటున్నాం.

రాష్ట్రంలో నిర్బంధ పాలన పోయింది. మార్పు మొదలైంది: సీఎం రేవంత్‌రెడ్డి

2014 జూన్ 2నే మార్పు మొదలైంది.. తెలంగాణ నిర్బంధం వీడింది..: కేటీఆర్

అవును నిజమే మార్పు మొదలైంది. నిర్బంధం పోయింది. 2014 జూన్ రెండునే దాస్యశృంఖలాల నుంచి తెలంగాణకు విముక్తి లభించింది. ఆ రోజునే నిర్బంధం పోయింది. దరిద్రం ఏంటంటే.. గతంలో మనల్ని పీడించిన వాళ్లు పోయారు. కానీ వాళ్ల పేర్లు తలుచుకునే వారు ఇంకా ఇక్కడే ఉన్నారు.

కొంతమంది ఎన్‌ఆర్‌ఐలకు ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే అర్థం తెలియటం లేదు. మనం ప్రయత్నం చేసినా కూడా వారు తెలుసుకోరు. ఎన్‌ఆర్‌ఐలు నాన్ రిలయబుల్ ఇండియన్స్. ఎన్‌ఆర్‌ఐలతో వచ్చిన ఇబ్బందే ఇది. వాళ్లకు ఏ విషయాలూ తెలియవు.: సీఎం రేవంత్‌రెడ్డి

ఎన్నారైలకు టికెట్లు అమ్ముకున్నదెవరో: కేటీఆర్

ఎన్నారైలకు టికెట్లు అమ్ముకున్నది ఎవరు? ఎన్నారైలు ఎవరు? 100 కోట్ల భారతీయులను కాదని, బయటి దేశం వాళ్లను అధ్యక్షులుగా చేసుకున్న కాంగ్రెస్.. ఎన్నారైల గురించి మాట్లాడితే ఎట్లా?

చీమలు పెట్టిన పుట్టలో పాములు చొచ్చినట్లు. ఎవరో పెట్టిన బీఆర్‌ఎస్ పార్టీలో వీరంతా చేరారు: సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో దూరి సీఎం అయ్యిందెవరో: కేటీఆర్

చీమలు పెట్టిన పుట్ట.. కాంగ్రెస్‌లో మా భట్టి అన్న, మా శ్రీధర్ అన్న, మా దామోదరన్న, మా ప్రభాకరన్న, మా కోమటిరెడ్డన్న, మా ఉత్తమ్ అన్న.. ఇలా వీళ్లందరు కలిసి పెట్టిన పార్టీలో ఇవాళ దూరి సీఎం పదవి తీసుకున్న వారు చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరాయనడం ఛండాలంగా ఉంటుంది.

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

ఇందిరమ్మ రాజ్యమంటే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం, దళితులు, గిరిజనులకు అసైన్డ్ భూములిస్తాం, పోడు పట్టాలిస్తాం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ, మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు ఇస్తాం.

నియంతృత్వం, పేదరికం ఇదేనా ఇందిరమ్మ రాజ్యం: కేటీఆర్

ఇందిరమ్మ రాజ్యమేందో గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. ఇందిరమ్మ పాలనలో గంజి కేంద్రాలున్న విషయం గుర్తుచేయాలి, కరెంట్‌లేనిది గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో నిర్బంధాలను గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో నియంతృత్వాన్ని గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో ఆర్టికల్ 365ని దుర్వినియోగం చేసి ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఏ విధంగా రద్దు చేశారో గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో ముల్కీ రూల్‌ను ఏ విధంగా తుంగలో తొక్కారో గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో ఇంటింటికి తాగునీరు ఇవ్వలేని దుస్థితిని గుర్తు చేయాలి, ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన గరిబీ హఠావో నినాదాన్ని ఏ విధంగా మర్చిపోయారో గుర్తు చేయాలి.

రైతుల గురించి అన్నీ అబద్ధాలే : సీఎం రేవంత్

రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న రైతు బీమా పథకం ప్రకారం 1,21,965 మంది మరణించారు. ఇవి ప్రభుత్వం చేసిన హత్యలు కావా? ఇదా రైతు ప్రభుత్వం. పంటలకు బీమా ఉండాలే తప్పు.. రైతు చనిపోయిన తర్వాత ఏం ఇచ్చినా ఏం లాభం లేదు.

వాడివేడిగా ధన్యవాదన!

మొదటిపేజీ తరువాయి...

నుంచి కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు. మధ్యాహ్నం 3 గంటలకు స్పీకర్ సభకు టీ విరామం ఇచ్చారు. 45 నిమిషాల అనంతరం సభ ప్రారంభం కాగానే సభానాయకుడిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

అనుక్షణం ఉత్కంఠ..

గవర్నర్ ప్రసంగం తప్పుల తడకలా ఉన్నదని, అసత్యాలు, అభూత కల్పనలతో ఉన్నదని కేటీఆర్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, కరెంట్ కష్టాలు, తెలంగాణ పల్లెల్లో రక్త పుటేరులు పారించే అప్రజాస్వామిక రాజ్యాన్ని మళ్లీ తెస్తారా? అని ప్రశ్నించారు. కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అడ్డుకున్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం? అని కేటీఆర్ నిలదీస్తున్న సమయంలో సభలో కాంగ్రెస్ సభ్యులు అడ్డుకోవటానికి ప్రయత్నించారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది. సీఎం కలుగజేసుకొని ఎన్నారైలకు ప్రజాస్వామ్య విలువల గురించి ఏం తెలుస్తాయని, మేనేజ్‌మెంట్ కోటాలో సభకు వచ్చిన వాళ్లకు ఏమీ తెలుసని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ వల్లే తెలంగాణ వచ్చిందని, మాజీ సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ అవకాశం ఇస్తే సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఓడిపోయిన దగ్గరి నుంచి చెప్పుకొచ్చారు. అలాగే ఎమ్మెల్యే కాకపోయినా హరీశ్‌రావును మంత్రిని చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని చెప్పే ప్రయత్నం చేస్తున్న క్రమంలో హరీశ్‌రావు అభ్యంతరం చెప్పారు. తెలంగాణ వల్ల, బీఆర్‌ఎస్ వల్లే కాంగ్రెస్ 2004లో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని విస్మరించకూడదని హరీశ్‌రావు అన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు అడుగడుగునా అడ్డుకున్నారు. వ్యక్తిగత విమర్శలకు, ఆరోపణలకు తావు ఇవ్వకుండా మాట్లాడాలని స్పీకర్ సూచించారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ ఆక్షేపించింది. కాంగ్రెస్‌కు మిత్రపక్షమైనంత మాత్రాన కూనంనేనిలాంటివాళ్లు వంత పాడాల్సిన అవసరం లేదని తప్పుబట్టింది. టీ విరామం అనంతరం రేవంత్‌రెడ్డి ప్రసంగించే సమయంలో సభ గందరగోళంగా మారింది. విపక్షంగా తాము నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని, మంచిచేస్తే అభినందిస్తామని, హామీల నుంచి తప్పుకుంటే ప్రజల పక్షం వహిస్తామని స్పష్టంచేశారు.

నీళ్లు నమిలిన అధికారపక్షం

ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేక అధికార పక్షం నీళ్లు నమిలింది. సమాధానాలు వెతకడానికి సభను కాసేపు వాయిదా వేయించుకున్నారని విపక్షాలు ఆరోపించాయి. విరామ సమయంలో భట్టి, ఇతర మంత్రులు, ప్రభుత్వ శాఖల పెద్దలను హుటాహుటిన తన చాంబర్‌లోకి పిలిపించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. విపక్షాన్ని ఇరుకునపెట్టే వ్యూహాన్ని ఖరారు చేసుకున్నాకే సభ తిరిగి ప్రారంభమైందన్నట్టు కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ మాదిరిగా సభానాయకుడు మాట్లాడుతున్నారని, కుటుంబపాలన, అవినీతి పాలన అంటూ పేర్కొంటున్నారంటేనే అధికార పక్షం దగ్గర విషయం లేనట్టు అర్థమైపోయిందని బీఆర్‌ఎస్ సభ్యులు విమర్శించారు.

రగడ...రగడ

సీఎం ప్రసంగంలో మధ్యమధ్యలో వ్యక్తిగత అంశాలు ప్రస్తావించటంపై బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఒకదశలో రేవంత్‌రెడ్డి 'వాళ్లు వినాల్సిందే.. వాళ్లకు వినటమే సరైన శిక్ష. వాళ్లను బయటికి వెళ్లనీయం' అని పేర్కొనటంతో తీవ్ర గందరగోళం నెలకొన్నది. అచ్చోసిన ఆంబోతులు అని సీఎం పేర్కొనటాన్ని బీఆర్‌ఎస్ సభ్యులు తప్పుబట్టారు. మరో సందర్భంలో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి పేర్కొనటంతో 'అవును సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సభలో బీఆర్‌ఎస్ సభ్యులు ఆక్షేపణ చెప్పినప్పుడల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నోరుమూసుకోండి.. కూసోండి.. కూసోండి అంటూ మీదపడ్డారు. ఒకదశలో మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు, పొన్నం తమ సభ్యులను నిలువరించే ప్రయత్నం చేశారు. సీఎం ప్రసంగిస్తుండగా ఎమ్మెల్యే హరీశ్‌రావు పాయింట్ ఆర్డర్ లేవనెత్తారు. సభానాయకుడి ప్రసంగం పూర్తయిన తరువాత అవకాశం ఇస్తామని స్పీకర్ చెప్పటంతో ఆయన ఆగారు. సీఎం ప్రసంగం పూర్తయిన తర్వాత అవకాశం ఇవ్వాలని హరీశ్ పట్టుబట్టారు. అయితే, పార్టీ తరఫున ముందు మాట్లాడిన నాయకుడే (కేటీఆర్) మాట్లాడాలని అన్నారు. దీనిపై బీఆర్‌ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

'ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తామని మాట ఇచ్చి.. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తారా?.. సీఎం మాట్లాడిన అంశాలపై క్లారిఫై చెప్పేందుకు తనకు 15 నిమిషాల సమయం ఇవ్వాలని, అలా అయితే ప్రజాస్వామ్యానికి విలువ ఇచ్చినట్టు లేదంటే నిరంకుశంగా వ్యవహరించినట్టే' అని అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, సంజయ్, మాగంటి గోపీనాథ్ తదితరులు స్పీకర్ వెల్‌లోకి వెళ్లారు. అంతుకు ముందూ మూడుసార్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ తీరుకు నిరసనగా వెల్‌లోకి దూసుకెళ్లారు. క్లారిఫికేషన్ కోసం తనకు అవకాశం ఇస్తానని ఇవ్వకపోడంతో ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు సైతం స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఈ సమయంలో మార్షల్స్ రంగ ప్రవేశం చేయటంతో సభలో వాతావరణం అట్టుడికింది. ఈ క్రమంలో క్లారిఫికేషన్‌కు సమయం ఇవ్వకుండానే స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో జై తెలంగాణ.. సేవ్ డెమోక్రసీ అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. సభ నుంచే నినాదాలు చేస్తూ మీడియా పాయింట్ వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తొలిరోజే ప్రజాస్వామ్యాన్ని బుల్డోజ్ చేసిందని విరుచుకుపడ్డారు.

ఈ ప్రభుత్వానిదే బాధ్యత!

శాసన సభ, శాసన మండలిలోనూ ప్రసంగం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే తడబడ్డారు. గత ప్రభుత్వం గురించి మాట్లాడుతూ.. అనేకసార్లు ఈ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ క్రమంలో మండలిలో మధుసూదనాచారి కలుగజేసుకుని, 'మీ ప్రభుత్వానిదే బాధ్యత.. మేమేమైనా కాదన్నామా?' అనడంతో రేవంత్ రెడ్డి నాలుక్కరుచుకున్నారు. ఇక నుంచి ఈ ప్రభుత్వం, గత ప్రభుత్వం అనకుండా కేసీఆర్ ప్రభుత్వం అంటానని స్పష్టంచేశారు.

రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులిస్తాం

- ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): క్రెడిట్, డెబిట్‌కార్డు తరహాలో విద్యార్థులకు యువవికాసం పథకంలో భాగంగా విద్యాభరోసా కార్డులను అందజేస్తామని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని రామ్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టగా, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బలపరిచారు. విద్యాభరోసాకార్డులో రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తామని చెప్పారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను నెలకొల్పుతామన్నారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తాం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ):అతి త్వరలోనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. బీపీఎల్ కుటుంబాలకు ఈ పథకంతో లబ్ధిచేకూరుతుందని తెలిపారు. సింగరేణిలో మరో 850 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పాల్సిన అవసరమున్నదని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వనున్నామని, ఇంటి స్థలం లేని వారికి 250 గజాల స్థలాన్నిచ్చి ఇండ్లను నిర్మించి ఇస్తామని, అవసరమైతే కొనుగోలు చేసి అయినా స్థలాలిస్తామని పేర్కొన్నారు.